క్లుప్తంగా

అమరుల ఆశయాలు సాధించాలి



వనపర్తి రూరల్: ప్రజల కోసం పోరాడిన అమరుల ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి బర్ధన్, వనపర్తి జిల్లా మాజీ కార్యదర్శి చంద్రయ్య వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ మత రాజకీయాలు ముమ్మరమైన దశలో బర్ధన్ సీపీఐ పగ్గాలు చేపట్టి సమర్థవంతంగా పార్టీని పటిష్టం చేశారని కొనియాడారు. కార్మిక పోరాటాల వల్ల కార్మిక అనుకూల చట్టాలు వచ్చాయన్నారు. జిల్లా పార్టీ ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజల పక్షాన పనిచేయడమే మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, శ్రీరామ్, గోపాలకృష్ణ, శ్రీహరి, రవీందర్, పృథ్వీనాదం, శిరీష, చిన్నకురుమన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని ఎంపీడీఓ గోవింద్‌రావు గురువారం పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో సర్వే కొనసాగుతుందని ప్రజాపాలనలో వచ్చిన 13,540 దరఖాస్తుల అధారంగా సర్వే సాగుతుందని, ఇప్పటి వరకు మండలంలో 81 శాతం పూర్తైనట్లు ఆయన వెల్లడించారు. ప్రజా పాలనలో దరఖాస్తులు ఇచ్చిన లబ్ధిదారులు అధికారులు వచ్చిన సమయంలో ఇంటి వద్ద లేకపోవడంతో వివరాల నమోదులో కొంత జాప్యం జరుగుతుందని ఆయన తెలిపారు.

శంకరమ్మపేటలో పశువుల అపహరణ



మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటలో గురువారం రాత్రి పశువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామానికి చెందిన రంగం కొండన్న బుధవారం రాత్రి తన కొట్టం వద్ద పశువులను కట్టేసి వచ్చారు. ఉదయం వెళ్లేసరికి రెండు ఆవులు, ఒక ఎద్దు కన్పించలేదు. దీంతో బాధితుడు మదనాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల సహకారంతో పశువులను ఎంత వెతికినా దొరకలేదని కన్నీరు మున్నీరయ్యారు. దొంగలు తీసుకెళ్లిన పశువుల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. ఎవరికైనా పశువుల జాడలు తెలిసినా తెలపాలని కోరుతున్నారు. ఎస్‌ఐ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

'అర్హులందరికీ ఆరు గ్యారంటీలు ఇవ్వాలి'



అమరచింత: ప్రజాపాలన ద్వారా అర్హులందరికీ ప్రభుత్వపరంగా అందించాల్సిన ఆరు గ్యారంటీలను వర్తింపజేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని దరఖాస్తుదారులు ముట్టడించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ పార్టీ నాయకులు ప్రసాద్, రాజన్న, సామేలు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ పేదలకు అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వంద రోజుల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు నేటికీ జీరో కరెంటు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పడమే కానీ ఇంత వరకు సబ్సిడీ డబ్బులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి మరోమారు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ నురుల్‌నజీంకు అందించారు. కార్యక్రమంలో రాజు, కురుమన్న, ప్రేమరత్నం, మన్నమని, జిలాని పాల్గొన్నారు.

పెరిగిన వరి దిగుబడి



గోపాల్‌పేట కొనుగోలు కేంద్రంలో లారీలోకి వరిధాన్యం తరలిస్తున్న హమాలీలు (ఫైల్)

- వానాకాలంలో 1.30లక్షల క్వింటాళ్ల వడ్లు సేకరణ
- బోనస్ లభిస్తుండటంతో సన్నాలు సాగు చేయడానికే మొగ్గు
- యాసంగిలో సాగు విస్తీర్ణం పెరగొచ్చని అధికారుల అంచనా

గోపాల్‌పేట: వానాకాలం సీజన్‌లో మండలంలో వరి పంట దిగుబడి పెరిగిందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా పడడంతో బోర్ల కింద, కేఎల్‌ఐ కాల్వ ఆనకట్టు రైతులు వరి సాగుకు మొగ్గు చూపారు. దీనికి తోడు ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించడంతో సాగు పెరుగుదలపై ప్రభావం చూపింది.

12,600 ఎకరాల్లో..

వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు గోపాల్‌పేట మండలంలో గతేడాది వానాకాలంలో 11,700 ఎకరాల పైచిలుకు వరి సాగు చేయగా.. ఈ ఏడాది 12,600 ఎకరాల్లో వరి నాటారు. కేఎల్‌ఐ ద్వారా మార్చి చివరి నాటికి సాగు నీరు అందిస్తామని అధికారులు స్పష్టం చేయడంతో యాసంగి సాగు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగానే సన్నాలకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

మండలంలో పరిస్థితి

గోపాల్‌పేట మండలంలో మెప్మా ఆధ్వర్యంలో 18 వరి కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో పది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 1,236 మంది రైతుల నుంచి 60,822 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం సేకరించారు. అలాగే 570 మంది రైతుల నుంచి 25,571 క్వింటాళ్ల సన్నరకం వరిధాన్యం సేకరించి మిల్లులకు పంపించారు. ఈ ఏడాది పీఏసీఎస్ ఆధ్వర్యంలో 44వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. మొత్తంగా చూసుకుంటే ఈ వానాకాలంలో మండలం నుంచి 1.30లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. గతేడాది కేవలం లక్ష క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు సైతం జమయ్యాయి. కొంత మందికి బోనస్ డబ్బులు పడలేదని, నాలుగు రోజుల్లో వారికి డబ్బులు పడతాయని ఏపీఎం చంద్రకళ చెప్పారు.

సన్నాలు సాగు చేస్తా



గతేడాది వానాకాలంలో ఎకరంలో వరి పంట సాగు చేయగా.. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడడంతో రెండు ఎకరాల్లో దొడ్డు వడ్లు సాగు చేశాం. పంట బాగానే వచ్చింది. ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం సన్నాలు సేకరించిన రైతులకు బోనస్ వేయడంతో నేను కూడా ఈ యాసంగిలో సన్న వడ్లు సాగు చేయాలని అనుకుంటున్నాం.

– విష్ణు, యువరైతు, గోపాల్‌పేట

మహిళా సంఘాలకు ప్రయోజనం

రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారి వివరాలు నమోదు చేసుకుంటున్నాం. ట్రక్ షీట్ వచ్చిన నాలుగైదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. మహిళా సంఘాలు ద్వారా ధాన్యం సేకరించడం ద్వారా వచ్చే కమీషన్ మహిళల అభ్యున్నతికి తోడ్పడుతుంది. కమీషన్ డబ్బులు గ్రామ సంఘం పొదుపులో జమ చేసుకుంటున్నారు.

– చంద్రకళ, ఏపీఎం, గోపాల్‌పేట

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి



ఖిల్లాఘనపురం: రైతులు వరి సాగులో నేరుగా వెదజల్లే పద్ధతి అలవర్చుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని ఏఓ మల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని సోళీపురంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఓ రైతు పొలంలో వరి విత్తనాలను వెదజల్లే పద్ధతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోళీపురంలో ఇప్పటికే కొంతమంది రైతులు ఈ పద్ధతిని పాటిస్తున్నారని తెలిపారు. వరి పంటను ముందుగా నారుమడి పోసి తరువాత కరిగెట్లు చేసి నాటే పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. కూలీలు సకాలంలో దొరకక చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్న ఈ కాలంలో 12 గంటల పాటు నానబెట్టిన వరి విత్తనాలను నేరుగా దున్నిన పొలంలో వెదజల్లు కోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్, రైతులు బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్‌నాయక్ తదితర రైతులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తకోట: టీపీయూఎస్ తపస్ కొత్తకోట శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ పీజే బాబు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్‌రెడ్డి, వివేకానంద, నిర్మలాదేవి తపస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవన్న, పి.శివనారాయణ, జిల్లా కార్యదర్శులు రాములు, తపస్ కార్యవర్గ సభ్యులు తిరుపతయ్య, ఈశ్వర్, కొత్తకోట మండల అధ్యక్షులు వి.రాఘవేంద్రచారి, ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కార్యదర్శి జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, సురేందర్, అక్షయ్‌కుమార్, శివశంకర్, అపర్ణ, పుష్పవతి పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

గోపాల్‌పేట: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా కొట్టిన ఘటన మండలంలోని తాడిపర్తిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఏదుల రిజర్వాయర్ వద్ద అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అభిలాష్ గురువారం వనపర్తి నుంచి ఏదులకు బయల్దేరాడు. తాడిపర్తి గ్రామంలోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా ద్విచక్రవాహనం కారు మీదకు దూసుకువచ్చింది. దీంతో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో కారు రోడ్డు కిందకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తాడిపర్తి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించడంతో పాటు స్థానికంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని, స్థానిక ఎన్నికలలో విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, గౌని కృపాకర్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్, నిరంజన్, మండ్ల రవి ఉన్నారు.



ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసిన పామాపురం కాంగ్రెస్ నాయకులు

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధచూపాలి



వీపనగండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువులు కొలుస్తున్న టీచర్లు



మెంటెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి ఆరోగ్యాన్ని ప్రతిరోజూ పర్యవేక్షించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను బరువులు కొలిచి, తక్కువ బరువు ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయ్, మహేశ్వరి, పారిజాత, చంద్రకళ, సువర్ణ, ఎల్లమ్మ, కమల, లక్ష్మి, హెల్పర్ లచ్చమ్మ పలువురు తల్లులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వనపర్తి రూరల్: మండలంలోని మెంటెపల్లి అంగన్‌వాడీ కేంద్రం– 1లో గురువారం టీచర్ పుష్పావతమ్మ కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు గల ఆహారం తీసుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ



నాగపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మకూర్: బ్యాంకులు, ఆలయాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకొని, చోరీల నియంత్రణకు సహకరించాలని ఎస్‌ఐ నరేందర్ కోరారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బ్యాంకుల అధికారులు, ఆలయాల పూజారులు, నిర్వాహకులతో సమావేశమయ్యారు. బ్యాంకుల వద్ద 24 గంటల పాటు సెక్యూరిటీ గార్డులను నియమించడంతో పాటు ఏటీఎంలు, బ్యాంకుల్లో పటిష్టమైన డోర్లు, లాకర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయాల్లో విలువైన వస్తువులు ఉంచరాదని, హిడెన్ లాకర్ సిస్టంలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని వాహనదారులకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మండలంలోని మూలమళ్లకు చెందిన అంజలన్న గత నెల 18న ఆత్మకూర్‌కు వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయిందని బాధితుడి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను ఒంగోలులో ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గురువారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించామన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

గోపాల్‌పేట: సోషల్ మీడియా, ఇంటర్‌నెట్‌తో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రేవల్లి ఎస్‌ఐ రాము అన్నారు. గురువారం రేవల్లి మండలంలోని నాగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లో వచ్చే అనుమానిత లింకులను ఓపెన్ చేయకూడదని, అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పరాదని సూచించారు. సైబర్ నేరగాళ్ల ద్వారా డబ్బులు పోయినట్లు అయితే వెంటనే ఆన్‌లైన్ కంప్లైంట్ నంబర్ 1930కు ఫోన్‌కాల్ చేయాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఉండటం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: రాయినిపల్లిలో 'మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ' అనే శీర్షికన గత నెల 28వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి భగీరథ అధికారులు స్పందించారు. గురువారం అధికారులు గ్రామంలోని మిషన్ భగీరథ లీకేజీ అవుతున్న పైపును తొలగించి నూతన పైపులైన్ ఏర్పాటు చేయడంతో సమస్య తీరింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని వెంకటగిరి క్షేత్రం నందు వెలిసిన భూలక్ష్మి వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. కల్యాణోత్సవానికి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భూలక్ష్మి వేంకటేశ్వరస్వామి దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. కల్యాణోత్సవానికి తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం గోవింద నామస్మరణంతో మార్మోగింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామస్మరణంతో ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులు, ఆలయ నిర్వాహకులు, గొల్ల బాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కోట్ల జగన్, వెంకటేశ్వర్‌రెడ్డి, పాలెం రాంబాబురెడ్డి, సంబరి భాస్కర్, రాజు, జ్యోతి, ఇంద్రదేవి, అనిత, సునీత తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తకోట: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి 44 వద్ద అయ్యప్ప జంక్షన్‌లో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీభూతనాథ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్‌రైజర్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.25,116వేలు విరాళంగా అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు గోపాలకృష్ణ, అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధూపం నాగరాజు కు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులు డాక్టర్ పీజే బాబు, వాకర్స్ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సన్ రైజర్స్ వాకింగ్ సభ్యులు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, న్యాయవాది రాములుయాదవ్, వినోద్‌సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వానాథం గంగాధర్, పాగాకు అనిల్‌కుమార్, భీమ కిషోర్‌కుమార్, సత్యంసాగర్ తదితరులు ఉన్నారు.



దాతలను సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న బీజేపీ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశానికి బీజేపీ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థాగత పర్వంలో భాగంగా భారతీయ జనతా పార్టీ రెండు నెలలుగా నిర్వహిస్తున్న ప్రాథమిక, క్రియాశీల సభ్యత్వ నమోదు, బూత్ కమిటీలను పూర్తి చేసుకున్నామని తెలిపారు. ప్రతి మండలంలో పోలింగ్ బూత్ కమిటీల్లో 75శాతం కమిటీలు పూర్తి చేసుకున్నామన్నారు. మండల కమిటీల నియామకంపై ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మార్గ నిర్దేశం చేయనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటల సమావేశం ప్రారంభమవుతుందని జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తకోట: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై గురువారం పెబ్బేరు మండలంలోని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎంవీఐ వాసుదేవరావు వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సైన్స్ ప్రదర్శన నిర్వహించగా విద్యార్థులు తమదైన శైలిలో ప్రదర్శనలు చేసి వాటిని ఆంగ్ల భాషలో క్షుణ్ణంగా వివరించి అక్కడికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఉద్యోగులు వెంకటేష్, నరేష్, ఉమారాణి, మోడల్ స్కూల్ పీడీ కమలాకర్ పాల్గొన్నారు.

వీపనగండ్ల విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి




వీపనగండ్ల: సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మదుగని శశీంద్ర మూడో బహుమతి గెలుచుకున్నారు. మదుగని పెద్ద రాముడు, లక్ష్మి దంపతుల కుమారుడు ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీని చదువుతున్నాడు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చడంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మూడో బహుమతిని గెలుచుకోవడంతో మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

మహాపడి పూజకు ముస్తాబు



అమరచింత: పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించే మహాపడిపూజ కార్యక్రమానికి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మహా పడిపూజ కార్యక్రమానికి ఆదిత్య పరాశ్రీ గురువు, నీలగిరి పీఠాధిపతి సుగురయ్య స్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పడిపూజల్లో స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌తో పాటు పలువురు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మాకం నర్సింహులు, కమలాకర్‌గౌడ్, క్యామ భాస్కర్ కోరారు.

శబరికి బయల్దేరిన మాలధారులు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద గురువారం అయ్యప్ప మాలధారులు ఇరుముడి పూజలు నిర్వహించారు. పూజ అనంతరం మొత్తం 60 మంది మాలధారులు శబరికి బయల్దేరి వెళ్లారు.

సంక్రాంతికి క్రీడా పోటీలు

గోపాల్‌పేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలో పోలీసు జనమైత్రి క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని గోపాల్‌పేట, రేవల్లి మండలాల ఎస్‌ఐలు నరేష్‌కుమార్, రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒకటి లేదా రెండు క్రికెట్ టీంలు, వాలీబాల్, రెండు లేదా మూడు బ్యాట్మింటన్ టీంలను అనుమతిస్తారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలిచిన క్రికెట్ టీం సభ్యులు గోపాల్‌పేట, రేవల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

30 బైక్‌లు సీజ్

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలో గురువారం రాత్రి ట్రాఫిక్ ఎస్‌ఐ నరేంద్ర, పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు లేని 30 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ ఉండాలని.. లేకుంటే సీజ్ చేస్తామని, విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ కృష్ణయ్య కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

అమరచింత: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి శుక్రవారం అమరచింతకు వస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ తెలిపారు.